క్లుప్తంగా



విశాఖలో జరిగిన మిలాన్ వేడుకకు విచ్చేసిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్‌కు స్వాగతం పలుకుతున్న అరకు ఎంపీ మాధవి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



కురిడి గ్రామ సచివాయంలో రికార్డులు పరిశీలస్తున్న ఎంపీడీవో చంద్రరావు

దుంబ్రిగుడ: గ్రామ సచివాలయాల్లో అందుబాటులో లేకుండా విధులకు గైర్హాజరవుతున్న వారిపై చర్యలు తప్పవని ఎంపీడీవో చంద్రరావు హెచ్చరించారు. కురిడి గ్రామ సచివాలయాన్ని ఆయన గురువారం పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. భవన పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఆయన ఆదేశించారు.

గ్రామాలకు విద్యుత్ సౌకర్యం



మాట్లాడుతున్న ఏఈ రామలింగేశ్వరరావు

అనంతగిరి: మండలంలోని రొంపల్లి పంచాయతీ బూరుగు, చినకోనెల గ్రామాలను విద్యుత్‌శాఖ ఏఈ ఏ.రామలింగేశ్వరరావు గురువారం సందర్శించారు. ఇటీవలగిరిజనులు తమ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, విశాఖపట్నం సీఎండీ, పాడేరు కలెక్టర్ వద్ద విన్నవించారు. ఉన్నతాధికారులు ఆదేశాలతో ఆయన గ్రామాన్ని సందర్శించి, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, విద్యుత్ లైన్లు, మెటీరియల్‌పై అంచనాలు వేసి, ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

జి.మాడుగుల: మండలంలోని గాంధీనగర్ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏటీడబ్ల్యూవో తిరిపాల్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, ఈ మేరకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులకు ఆరోగ్యపరమైన సమస్యలుంటే తక్షణమే ఉపాధ్యాయులకు వార్డెన్లకు తెలియజేయాలని సూచించారు. డిప్యూటీ వార్డెన్ చిన్ని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య సేవలపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ రాజీవ్

కూనవరం: మండల పరిధిలోని కోతులగుట్ట వెలుగు కార్యాలయంలో గురువారం మండల మహిళా సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రాజీవ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదేశాల మేరకు గ్రామాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు అందుతున్న వైద్యసేవలు, పథకాలు, వివరించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని కోరారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం రాయి భాస్కర్, డీపీఎం పూర్ణచంద్రరావు, మండల మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి మార్గాలు

- మారుమూల గ్రామాలకూ రహదారులు
- శరవేగంగా పనులు
- ఆనందంలో గిరిజనులు





నాడు డెక్కపురం గ్రామానికి వెళ్లే దారి



నేడు డెక్కాపురం గ్రామానికి రోడ్డు పనులు



కోనపురం సారగూడ మీదుగా బోందుగూడ వరకు నిర్మాణంలో ఉన్న రోడ్డు

అనంతగిరి: గతంలోని ఆ గ్రామాలకు చేరుకోవాలంటే కాలినడకే శరణ్యం.. మరికొన్ని గ్రామాలకు అయితే కనీసం నడిచేందుకు కూడా కానరాని దారులు.. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో గిరిజన గ్రామాలు కనీస అభివృద్ధికి నోచుకోలేదు..శివారు ప్రాంతాలకు అత్యవసర వాహనాలు రాక.. అనారోగ్యానికి పాల్పైతే డోలీపై కొండలు, గుట్టలు దాటి సుదూర ప్రాంతాలు మోసుకుని తరలించాల్సిన పరిస్థితి ఉండేది..సకాలంలో వైద్యం అందక మృత్యువాతకు గురైన సంఘటనలు కోకొల్లలు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కోట్లాది రూపాయల నిధులు మంజూరుతో మన్యంలో రహదారులకు మోక్షం కలిగింది. మండలంలోని మూడు విడుతల్లో రహదారుల పనులు జరిగాయి. మారుమూల గ్రామాల్లో రహదారుల పనులు శరవేగంగా జరుగుతుండడంతో గిరిజనులు ఆనందానికి ఆవధుల్లేకుండాపోయింది.

మొదటి విడతలో : మండలంలోని ఎస్.ఆర్.పురం- బంధవల(రూ.65 లక్షలు)ఎస్.ఆర్.పురం- బంధవంలన, బంధవలస-రాయిపాడు (రూ. 65 లక్షలు), రాయిపాడు- బొంగిజ(రూ.65 లక్షలు), బోంగిజ- చీడివలస(రూ. 65 లక్షలు), చీమిడివలస- బూరుగు (రూ.65 లక్షలు), , బూరుగు- చినకోనెల (రూ.65 లక్షలు), మకానపల్లి- సరియా(రూ.65 లక్షలు) , రేగం- తెనెపుట్టు (రూ.65 లక్షలు), మేడపర్తి -కొత్తవలస(రూ.40 లక్షలు), కర్రిగుడ- కడరేవ్(రూ.22లక్షలు), గాదిల్లోవ- చినరాభ(రూ.68 లక్షలు), నందిగుమ్మి- మద్దిగరువు(రూ. 40 లక్షలు), తెనెపుట్టు-తలారీపాడు(రూ.1.25కోట్లు), నిమ్మఊట- కర్రీగుడ (రూ.80 లక్షలు), జీలుగులపాడు-మెట్టపాలెం(రూ.1.50 కోట్లు), మెట్టపాలెం-మర్రివలస(రూ. 1.35 కోట్లు), మర్రివలస-గాదిల్లోవ(రూ. 1.30 కోట్లు), చినరాభ-పెదరాభ (రూ.1.50 కోట్లు), డబ్ల్యూబీఎం పెదరాభ- రొంపల్లి (రూ.1.30 కోట్లు), అనంతగిరి- పాతకోట(రూ.1.20 కోట్లు), పాతకోట-నందిగుమ్మి(రూ.1.10 కోట్లు) గ్రామం వరకు రోడ్డు వేశారు.

రెండ విడతలో..మండలంలోని కోనపురం- సారగూడ (రూ.60 లక్షలు), సారగూడ -లిడ్డంగి(రూ.62 లక్షలు), శివలింగపురం- చిట్టలగరువు(రూ.54 లక్షలు), తీగలమాడ-పనసుమానువలస(69 లక్షలు), కోనపురం -బొండ్యగూడ (రూ.70 లక్షలు), భీంపోల్-రాళ్లగెడ్డ (రూ.85 లక్షలు), రాళ్లగెడ్డ-సరియాపల్లి(రూ.1.8 కోట్లు), దుంబ్రివలస-గోమాంగిపాడు(రూ.95 లక్షలు), దుంబ్రివలస-టాంకోట(రూ.87 లక్షలు), కొత్తపాలెం -ఆర్డీపురం(రూ.2.5 కోట్లు), రొంపల్లి - కరకవలస(రూ.80 లక్షలు) గ్రామం వరకు రోడ్డు వేశారు.

మూడవ విడతలో..మండలంలోని బొడ్డపాడు-పుట్టపాడు(రూ. 1.2 కోట్లు), జెండగరువు- వంట్లమామిడి(రూ.1.2 కోట్లు), కుంభర్తి-చీడివలస- బొంగిజ (రూ. 2.4 కోట్లు), మెట్టవలస- ఒనుకొం(రూ.1.2 కోట్లు), రాజుపాక- దొనిమోరి(రూ.2.40 కోట్లు)గ్రామం వరకు రోడ్డు వేశారు.

మండలం: అనంతగిరి	
పంచాయితీలు	: 24
గ్రామాలు	: 418
జనాభా	: 50 వేలు
సచివాలయాలు	: 21
మొదటి విడతలో	: 30 గ్రామాలకు, రూ.19.40కోట్లు (60.85 కి.మీలు)
రెండవ విడతలో	: 11 గ్రామాలకు, రూ.10.20కోట్లు (35 కి.మీ.లు)
మూడవ విడతలో	: 5 గ్రామాలకు, రూ.10.20కోట్లు (28కి.మీ.లు)

జగనన్నకు రుణపడి ఉంటాం



జగనన్న ప్రభుత్వంలోనే నా కల నేరవెరింది. దశాబ్దాల తరబడి గ్రామాలకు రహదారులు లేవు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ రోడ్లు మెరుగుపడ్డాయి.ఇందుకు మా గ్రామమే నిదర్శనం. గ్రామంలో రహదారి కోసం ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, సర్పంచ్ రూతుతో కలిసి అరకు ఎమ్మెల్యే పాల్గుణకు విన్నవించారు. ఆయన ప్రత్యేక చొరవతో 8 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.40 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం రోడ్డు పనులు జరుగుతున్నాయి. చాలా ఆనందంగాం. మా కల నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి గ్రామస్తులంతా రుణపడి ఉంటాం.

– కిల్లో బాలరాజు, వలంటీర్, డెక్కపురం

త్వరితగతిన పనులు



59 గ్రామాలకు ఉపయోగపడేలా నిర్మాణం జరుగుతున్న రహదారి పనుల్లో నాణ్యత ప్రమాణాలతో చేపట్టే విధంగా చర్యలు చేపడుతున్నాం.. త్వరితగతిన రోడ్ల పనులను పూర్తి చేసి, గిరి గ్రామాలకు రాకపోకలు సుగమం చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. గ్రామాలకు రహదారుల నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. శివారు గ్రామాల్లోనూ రహదారులు జరుగుతున్నాయి. పనులను గడువులోగా పూర్తి చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్‌లకు ఆదేశాలు ఇచ్చాం. ఉన్నతాధికారుల సూచనలు, సహకారంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

– గణేష్, ఏఈ ట్రైబల్ వెల్ఫేర్, అనంతగి

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న తహసీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్

వీఆర్ పురం: బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేసి ఆడపిల్లల భవిష్యత్తును కాపాడాలని తహసీల్దార్ సయ్యద్‌మౌలానాఫాజిల్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం బాల్యవివాహల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం పూర్తిగా నిషేధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం ఐసీడీఎస్ సిబ్బంది మాట్లాడారు. ఆర్ఐ రామకృష్ణ, హెచ్‌సీ నిర్మల్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి



పిండిమిల్లు యంత్రాలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ గంగరాజు, సర్పంచులు, అధికారులు

అనంతగిరి: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం 2హెచ్‌పీవీ, 3హెచ్‌పీవీ సామర్థ్యం గల ఐదు పిండిమిల్లు యంత్రాలను జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, సర్పంచులు రూతు, సింహాద్రితో కలిసి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అనేక విధాలుగా అవకాశాలు కల్పిస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవో ఉమామహేశ్వరి మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై ఆయా యంత్రాలను అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమలో అగ్రికల్చర్ సిబ్బంది దీపిక, కుమారి , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శివారు గ్రామాలకు రహదారి సౌకర్యం

చింతపల్లిరూరల్: గిరిజన గ్రామాల్లో ఏళ్ల తరబడి రహదారికి నోచుకోని గ్రామాలకు రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని పాడేరు ఎమ్మెల్యే, అరకు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలో కొమ్మంగి పంచాయతీలో కిక్కిసలబంధ నుంచి లుబ్బగుంట వరకు రూ.40 లక్షలతో ,జెర్రిగెడ్డ గ్రామం వరకు మరో రూ.40 లక్షలతో నిర్మిస్తున్న రహదారి పనులకు ఆమె గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అములులోకి వచ్చిన తరువాత మండాలన్ని అనుసంధానం చేస్తు అనేక గ్రామాలకు రహదారులు నిర్మించడం జరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, వైస్ ఎంపీపీలు శారద, వెంగళరావు, సర్పంచ్‌లు పాంగి లక్ష్మి, దురియా పుష్పలత ,లోతా పండయ్య, జెఏసీ మండల కన్వీనర్ గణబాబు, ఎంపీడీవో వీరసాయిబాబు, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ మోరి రవి, స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ మీరా, కో-అప్షన్ సభ్యులు నాజర్‌వలీ, ఎంపీటీసీ సభ్యులు ధారలక్ష్మి, జయలక్ష్మి, మోహన్‌రావు, మీనాకుమారి, నాయకులు జోషప్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



రహదారి శిలాఫలకాలను ప్రారంభిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి

అరకులోయ రూరల్: మండలంలోని పద్మాపురం మేజర్ పంచాయతీ యండపల్లివలసలో వైఎస్సార్‌సీపీ అరకు నియోజకవర్గ సమన్వయకర్త రేగం మత్స్యలింగం గురువారం పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలుచేస్తున్న నవరత్న పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించి, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. సర్పంచ్ సుస్మి త, ఎంపీటీసీ సభ్యులు రాంచందర్, సత్రుగున్, నాయకులు యాసీన్, సుంద్ర, నొబో, రామ్మూర్తి పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో సింగర్బ పంచాయతీ గొడ్డుబూసులు గ్రామంలో గురువారం వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు వండ్లాబు దేముళ్ళనాయుడు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథగా విచ్చేసిన పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా పనిచేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. పాడేరులో శనివారం నిర్వహించనున్న పార్టీ కేడర్ సమావేశానికి ఉత్తరాంధ్ర వైఎస్సార్ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, జిల్లా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేస్తున్నారని అందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దేముళ్లనాయుడు దంపతులు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. మండల పార్టీ అధ్యక్షుడు సుర్మని మత్స్యకొండనాయుడు, సర్పంచ్ కిముడు రాంబాబు, పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పాంగి రామకృష్ణ, మాజీ సర్పంచ్ సీతారాం నాయుడు, క్రిష్టియన్ మైనార్టీ మండల అధ్యక్షుడు వి.కృష్ణారావు, నాయకులు గంగరాజు, చిట్టిబాబు, సోమలింగం, లక్ష్మినాయుడు, డాక్టర్ చంటిబాబు, శేఖర్, పండన్న, రమణబాబు, కొండబాబు, కృష్ణమూర్తి, సోషల్ మీడియా కన్వీనర్ లక్ష్మణ్, శ్రీనివాస్,మత్స్యకొండబాబు, కూర్మరాజు, అనిల్, రామారావు, రామకృష్ణ, చిన్నబ్బాయి పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న అరకు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యలింగం



గొడ్డుబూసులులో పార్టీ నాయకులతో పాడేరు సమన్వయకర్త విశ్వేశ్వరరాజు, నేతలు

మహిళల ఆర్థికాభివృద్ధే జగనన్న ధ్యేయం

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం అనేక పథకాలు అమలుచేస్తోందన్నారు. గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు రుణమాఫీ చేస్తామని అబద్ధపు హామీలిచ్చి మోసం చేశాడని, మరోసారి వైఎస్సార్‌సీపీ పథకాలను కాపీ కొడుతూ అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నాడని, ఇందు కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీని చిత్తుగా ఓడించి గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేశారన్నారు. జగనన్నకు అందరూ అండగా నిలిచి వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. నాలుగో విడత ద్వారా 4,607మందికి డ్వాక్రా మహిళలకు రూ,1,28,81,441. చెక్కుల రూపంలో అందజేశారు.అనంతరం స్త్రీనిధి ద్వారా డ్వాక్రా మహిళలకు 376 స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.1,8500,000 చెక్కుల రూపంలో అందజేశారు. ఆయా నిధులను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా డ్వాక్రా సంఘ సభ్యులు బంగురు రాజులమ్మ, జానకమ్మ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగు విడతలుగా ఆర్థికసాయమందించి, తమ కుటుంబాలు అభ్యున్నతికి ఎంతో సాయమందించిందన్నారు. తమ కుటుంబాలన్నీ సీఎం జగనన్నకు రుణపడి ఉంటామన్నారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు శాంతి, డీఆర్‌డీఏ పీడీ మురళీ, ఏరియా కో-ఆర్డినేటర్ శెట్టి కృష్ణారావు, డీపీఎం నీలకంఠం, ఏపీఎం సురిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు గీత, నాయకుడు చిరంజీవి, వెలుగు సిబ్బంది దాసు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ ఆసరా చెక్కులను అందజేస్తున్న ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ

రీసర్వేతో రైతులకు మేలు

హుకుంపేట: శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకంలో భాగంగా ప్రభుత్వం గ్రామల్లో రీసర్వేలు నిర్వహించి భూ హక్కు పత్రాలు పంపిణీ చేయడం ద్వారా గిరిజనులకు శాశ్వత భూ సమస్య పరిష్కారమవుతుందని, దీంతో ప్రజలకు ఎంతగానో మేలు జరుగుతుందని సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ అన్నారు.మండలంలోని దాలిగుమ్మడి, డీ.చింతలవీధి, దిగుడుపుట్టు గ్రామాల గిరిజనులకు 338 మందికి భూ పట్టాలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు రమ, కన్వీనర్లు అనిల్, సూరిబాబు, వీఆర్‌వో కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులకు పట్టాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వెంకటపూర్ణిమ, ఎంపీటీసీ రమ

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

గూడెంకొత్తవీధి: దారకొండ సెక్టారు పరిధిలోని పలు అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీ దేవి సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు సకాలంలో పోషకాహారాన్ని సక్రమంగా అందించాలని సిబ్బందికి ఆదేశించారు. జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు.

నేడు వలంటీర్లకు సత్కారం

గంగవరం/ దేవీపట్నం : దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలో, గంగవరం మండలం నెల్లిపూడిలో శుక్రవారం వలంటీర్ల సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పార్టీ నాయకుడు తోట రాజేశ్వరరావు చెప్పారు. ఇందుకూరుపేటలో మధ్యాహ్నం 1.30కు, నెల్లిపూడిలో సాయంత్రం 4గంటలకు జరగనన్న కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు ముఖ్యఅతిథిగా హాజరువుతున్నట్టు చెప్పారు.

ఉపాధి కల్పనే లక్ష్యంగా జాబ్‌మేళా

ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు: స్థానిక ఐటీడీఏ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈనెల 27న చింతూరులో నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తెలిపారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 27న చింతూరులోని గురుకుల పాఠశాల ఆవరణలో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫార్మసి, ఫైనాన్స్, ట్రాన్స్‌పోర్ట్ తదితర 10 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటున్నాయన్నారు. వీటితోపాటు మరో మూడు కంపెనీలు కూడా పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. 800 ఖాళీలకు సంబంధించి రాజమహేంద్రవరం, కాకినాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. జాబ్‌మేళాపై ఐటీడీఏ పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రచా రం నిర్వహించేలా చర్యలు చేపట్టామని, చింతూరు, వీఆర్ పురం, కూనవరం, ఎటపాక మండలాలకు చెందిన నిరుద్యోగ యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రానున్న కాలంలో మరిన్ని కంపెనీలతో పెద్దఎత్తున జాబ్‌మేళా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పీవో తెలిపారు.



జాబ్‌మేళా బ్రోచర్‌ను విడుదల చేస్తున్న పీవో కావూరి చైతన్య

ప్రహరీ నిర్మాణానికి వినతి

అరకులోయ రూరల్: పట్టణ పరిధిలోని శ్మశానవాటికలో ప్రహరీ నిర్మించాలని కోరుతూ శరభగుడ, కంఠభంసుగుడకు చెందిన గిరిజనులు ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్‌కుమార్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించి,సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

315 లీటర్ల సారా స్వాధీనం

ఎటపాక: మండలంంలోని గుండువారిగూడెంలో సారా స్థావరాలపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు.జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు ఆదేశాల మేరు అసిస్టెంట్ సూపరింటెండెంట్ నాగుల్‌మీరా ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో 11,550 లీటర్ల బెల్లం ఊట, సుమారు 315 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. ఇంటెలిజెన్స్ వింగ్, ఎస్ఈబీ, ఎక్సైజ్ అధికారులు, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

గృహాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

కొయ్యూరు: ప్రభుత్వం అందిస్తున్న గృహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకుల నుంచి ప్రభుత్వ పింఛన్ల సొమ్ము విడుదల చేసుకునేందుకు గ్రామ సచివాలయం పేరుతో పాన్‌కార్డును వినియోగించాలని, ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణకు సంబంధించి జమ అయ్యే నిధులకు సంబంధిత అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీపై ఏఎన్ఎంలు పర్యవేక్షించాలని, వివరాలు నమోదు చేయాలన్నారు. జగనన్న సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రతీ లబ్ధిదారునికి విధిగా కరపత్రాలు పంపిణీ చేయాలని సూచించారు. విధుల్లో ఎవరూ నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పనవి ఆయన హెచ్చరించారు.

సర్వీసును కొనసాగించాలని వినతి

ముంచంగిపుట్టు/పెదబయలు: తమ సర్వీసు రెన్యూవల్ చేయాలని, కోరుతూ బహు భాషా ఉపాధ్యాయులు ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లో గురువారం ర్యాలీలు నిర్వహించారు.జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో కువి, కొండ, ఆదివాసీ, ఒడియా భాషలో బోధిస్తున్న బహు భాషా ఉపాధ్యాయులు తమ సర్వీసు కొనసాగించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాయకులు సత్యనారాయణ, త్రినాథ్, వీరయ్య, శరభన్న,గంగాధరం, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందించాలి

రాజవొమ్మంగి: జడ్డంగిలో హైవే నిర్మాణం కోసం భూములు, గృహాలు కోల్పోయిన తమకు పరిహారం చెల్లించాలని పలువురు బాధితులు గురువారం రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ డి.వి.సత్యనారాయణ, సీఐ సన్యాసినాయుడు బాధితులతో మాట్లాడి, త్వరితగతిన పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ మురళీకృష్ణ తదితరులున్నారు.